క్లుప్తంగా

డివిజన్ స్థాయి స్పందనకు 10 అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి

పెద్దాపురం: డివిజన్ స్థాయి స్పందనకు సోమవారం పది అర్జీలు అందినట్టు ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. స్థల ఆక్రమణ ఖాళీ చేయించాలని, విద్యుత్ మీటర్‌ను పునరుద్ధరించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర ఫిర్యాదులు అందినట్లు వారు వెల్లడించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఎల్‌పీఓ బాలామణి, ఏడీఏ దైవ కుమార్, రవిశంకర్, ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టు మెషీన్లు అందుకున్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలోని పీబీ దేవం గ్రామంలో మహిళలకు అందజేసిన కుట్టు మెషీన్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు అన్నారు. గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థికంగా వెనుక బడిన 80 మంది మహిళలకు రాష్ట్ర స్వర్ణ సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చి, అనంతరం కుట్టు మెషీన్లు ఇవ్వడం అభినందనీయం అన్నారు. సంస్థ అధినేత గుడివాడ భానుప్రసాద్, డైరెక్టర్ వసలపూడి స్వర్ణలత, కాకినాడ కోఆర్డినేటర్ సుధ, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మండల కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరావు

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కారే ఉదయకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు సన్మానం

సామర్లకోట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ సీహెచ్ వీర్రాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నేదునూరి మురళీకృష్ణ, బడెజాన్ సుభాకర్ చార్లెస్‌లను స్థానిక లయన్స్ క్లబ్ భవనంతో మంగళవారం సత్కరించనున్నామని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం స్వామి వారికి ప్రీతైన సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఉప ఆలయాలల్లోని స్వామి వార్లు, అమ్మవార్లకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయగా ట్రస్టు బోర్డు సభ్యులు భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పాడి రైతులకు కొండంత అండ

- గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కేంద్రాల ఏర్పాటు
- రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న ప్రభుత్వం
- పిఠాపురం నియోజకవర్గంలో 27 కేంద్రాలు
- ప్రతి రోజూ 1,500 లీటర్ల పాల సేకరణ



పొన్నాడలో పాలు సేకరిస్తున్న సిబ్బంది



మూలపేటలో పాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ

కొత్తపల్లి: పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాడి రైతులకు పలు ప్రోత్సాహకాలను అందిస్తోంది. రైతుల నుంచి పాలను సేకరించేందుకు గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు కేంద్రాల కంటే పాడి రైతులకు గిట్టుబాటు ధర ఇస్తున్నారు. గ్రామాల్లో అధికారులు పర్యటించి పాలవెల్లువ కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సొంత గ్రామంలోనే పాలను అమ్ముకునే విధంగా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో...

పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఇప్పటివరకూ 27 జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రోజుకు సుమారు 1500 లీటర్ల పాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పాలవెల్లువ కేంద్రాల ద్వారా కలిగే ప్రయోజనాలు

- పాల ఉత్పత్తిదారులు సహకార సంఘంలో సభ్యులుగా ఉంటే ఏడాది పొడవునా సొసైటీకి పాలు పోయవచ్చు.
- పాలు ఎక్కువగా, తక్కువగా లభించే కాలాల్లోనూ పాల సేకరణకు ఏటువంటి ఇబ్బంది ఉండదు.
- కేంద్రాలో మధ్యవర్తులు, ఏజెంట్లు ఉండరు. అందువల్ల వారికి వెళ్లే లాభాలు కూడా సహకార సంఘాల ద్వారా నేరుగా పాడి రైతులకు లభిస్తాయి.
- పాల సేకరణ, ధరల చెల్లింపులో పారదర్శకత ఉంటుంది.
- రైతులకు మొబైల్ అప్లికేషన్ ద్వారా వారి సొంత మొబైల్‌లో వారి పాల వివరాలతో కూడిన సంక్షిప్త సమాచారం అందుబాటులో ఉంటుంది.

రైతులకు రుణాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు పాలు పోసే రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రయోజనాలను కల్పిస్తోంది. దాణాను సబ్సిడీపై అందించడమే కాకుండా గేదెలు ఉన్న పాడి రైతులకు ఒక్కో గేదెకు రూ.35 వేల చొప్పున 3 గేదెల వరకూ బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చు. ఇప్పటివరకూ మండలంలో 774 మంది రైతులు ఈ కేంద్రాల్లో సభ్యులుగా ఉన్నారు.

నియోజకవర్గంలో పాల సేకరణ వివరాలు

మండలం	కేంద్రాలు	రోజుకు పాల సేకరణ (లీటర్లలో)
కొత్తపల్లి	10	550
గొల్లప్రోలు	8	500
పిఠాపురం	9	450

అవగాహన కల్పిస్తున్నాం



కొత్తపల్లి మండలంలో ఇప్పటికే 10 జగనన్న పాల సేకరణ కేంద్రాలను ప్రారంభించాం. మరో మూడు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తాం. ఈ కేంద్రాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. 14 వెన్న శాతం ఉంటే లీటరు పాలకు రూ.96 వరకూ లభిస్తుంది. ప్రతి పాడి రైతు పాలవెల్లువ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీమన్నారాయణ, పశువైద్యాధికారి, కొత్తపల్లి

ధర లాభసాటిగా ఉంది



ప్రైవేటు డెయిరీల కంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో ధర లాభసాటిగా ఉంది. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. నాకు రెండు పాడి గేదెలు ఉన్నాయి. ప్రతిరోజూ కేంద్రానికి సుమారు 4 లీటర్ల పాలు పోస్తున్నాను. ప్రైవేటు కేంద్రాల్లో వెన్నశాతం ఎంత ఎక్కువగా ఉన్నా రూ.80 కంటే ఎక్కువ ఇవ్వడం లేదు. ప్రభుత్వ కేంద్రాల్లో 14 శాతం వెన్నశాతం ఉంటే రూ.96 ఇస్తున్నారు.

– దడాల సత్యవతి, పాడిరైతు, పొన్నాడ

నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రకృతి ఇచ్చిన సహజ వనరులలో నీటి వనరులను రక్షించి భావితరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛ పక్వాడలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జలవనరులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛత పాటించాలన్నారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించగా పేరెంట్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని పాస్టర్‌కు గాయాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాస్టర్ వంకా జాన్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం మోటారు సైకిలుపై కాకినాడ వెళ్తున్న శాంతి బాప్టిస్టు చర్చి పాస్టరును కాకినాడ నుంచి వస్తున్న లారీ వీకే రాయపురం సమీపంలో ఢీ కొంది. దాంతో జాన్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రికి జాన్‌ను చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్ రావడం గగనమని, ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఠాపురం పట్టణంలో 303 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీ పండుగ రోజుగా మారిందన్నారు. ఎటువంటి సిఫార్సులు, పైసా ఖర్చు లేకుండా లబ్ధిదారుల ఇంటికే పింఛన్లు అందుతున్నాయన్నారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి తెచ్చి పింఛన్లు ఇవ్వడం దేశంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు తలిశెట్టి వెంకటేశ్వరరావు, గండేపల్లి బాబీ, బోరు దేవ, కొత్తపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



మహాలక్ష్మి



షరీఫ్



మంజు త్రిమూర్తులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట ఎంపీపీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న కుడుపూడి మహాలక్ష్మి మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన గత 23 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో సేవలు అందిస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. సుమారు 200 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారు. బోధన వృత్తిలో వస్తున్న నూతన పోకడలను ఎప్పటికప్పుడు నేర్చుకుని ఎంతో మంది ఉపాధ్యాయుల్లో స్ఫూర్తి నింపుతున్నారు. ఆయన ఇప్పటికే పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.

భూపాలపట్నం నుంచి షరీఫ్

పెద్దాపురం: మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా రాయభూపాలపట్నం మెయిన్ పాఠశాలలో పని చేస్తున్న మహ్మద్ ఎం.షరీఫ్ ఎంపికైనట్టు ఎంఈఓలు చౌదరి, శర్మ తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది మండలం నుంచి ఆయనను ఎంపిక చేసినట్టు తెలిపారు. షరీఫ్‌ను పలువురు సహోపాధ్యాయులు అభినందించారు.

మాధవపట్నం నుంచి త్రిమూర్తులు

సామర్లకోట: మాధవపట్నం మండల ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు మంజు త్రిమూర్తులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైనట్టు ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య సోమవారం తెలిపారు. విద్యార్థులు విభిన్న పద్ధతుల్లో విద్యా బోధన చేస్తూ పాఠశాల పరిశుభ్రంగా ఉండేలా చేయడమే కాకుండా గోరుముద్దను అందరూ ఉపయోగించుకొనే విధంగా చేస్తున్నారని తెలిపారు. జగనన్న విద్యాకానుకను సకాలంలో విద్యార్థులందరికీ అందజేశారని తెలిపారు. త్రిమూర్తులును ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంఈఓ–2 పి.పుల్లయ్య అభినందించారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



పిఠాపురంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని, ఇతర రాష్ట్రాల నేతలు మన పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం 5, 6, 9 వార్డుల్లో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 85 సచివాలయాలు ఉండగా ఇప్పటివరకూ 68 సచివాలయాలను సందర్శించామన్నారు. 210 రోజుల్లో సుమారు 73 వేల కుటుంబాలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించామన్నారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన ప్రజల ముంగిటకే చేరిందన్నారు. గతంలో ఏ చిన్న పని కావాలన్నా సుదూర ప్రాంతాల్లోని మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దే గ్రామ సచివాలయాలు ఉండడం వల్ల ఏ పని ఉన్నా క్షణాల్లో చేయించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. అందరికీ అన్నంపెట్టే రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలను రైతుల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. కౌలు రైతులకు సైతం అన్ని పథకాలు వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, పచ్చిమళ్ల అప్పలరాజు, బొజ్జా దొరబాబు, పెదపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని 6వ సచివాలయం 9, 11 వార్డుల పరిధిలో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, బలుసు కనకం, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రజలకు అందుతున్న పథకాలను అడిగి తెలుసుకుని, సమస్యలను కూడా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ధర్మేంద్ర, కౌన్సిలర్ విడదాసరి రాజా, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, ఎంపీటీసీలు శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరిశీలించండి



సామర్లకోట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన మానవ హక్కుల సంఘ నాయకులు

సామర్లకోట: కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులను దోపిడీ చేయడానికి బస్సులు నడుపుతున్నాయని జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ ఎస్‌ఎల్‌వీ కుమారికి ఆయా విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌లను పరిశీలించాలని వినతి పత్రం అందజేశారు. ఇటీవల సామర్లకోట ఒక విద్యా సంస్థకు చెందిన బస్సు చక్రం ఊడిపోవడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మానవహక్కుల సంఘ నాయకులు జుత్తుక అప్పారావు, కుంచే నానిబాబు, ఎండీ వలీబాషా తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

సామర్లకోట: నిత్యావసర ధరలను నియంత్రణలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు ఆరోపించారు. ధరల పెరుగుదలపై సోమవారం స్థానిక తహసీల్దార్ ఎస్‌ఎల్‌వీ కుమారికి వినతి పత్రం అందజేశారు. రానున్న ఎన్నికలలో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు కరణం గోవిందరాజు, పి.వీరబాబు, డి.శ్రీను, చల్లా మహేష్, బి శ్రీను, కత్తెరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పెద్దాపురం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అధిక ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేశారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు ఆధ్వర్యంలో డీటీ కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, మాగాపు నాగు, డి.కృష్ణ, ఆర్.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం కార్యదర్శి కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అరికట్టాలని, రేషన్ షాపుల్లో 14 రకాల వస్తువులను ప్రజలకు అందించాలని, ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.అప్పారెడ్డి, సీహెచ్ పద్మాకరరావు, డి.గంగాధర్, ఎం.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో అప్పారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనంతలక్ష్మి

తొండంగి: కోదాడ పంచాయతీ వాకదారిపేటకు చెందిన ఇద్దరు వృద్ధులకు కాకినాడలో ఆసుపత్రిలో ఆ గ్రామ వలంటీర్ పింఛను అందజేసినట్టు ఎంపీడీఓ పసుపులేటి సతీష్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...వాకదారిపేటకు చెందిన పేకేటి అప్పారావు ఊపిరితిత్తుల సమస్యతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు గ్రామ వలంటీర్ కుక్కా అనంతలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి పింఛన్ నగదును అందజేసింది.

జూదమాడుతున్న ముగ్గురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో జూదమాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ అబ్దుల్ నబీ తెలిపారు. వారి నుంచి రూ.1300 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి



పిఠాపురం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం స్థానిక తహసీల్ద్రార్‌కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కుంచే చిన్న, కోనేటి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెరిగిన అధిక ధరలను అదుపులో ఉంచాలని, బొగ్గు గనులను కేంద్రం అదానీ కంపెనీలకు అప్పజెప్పడాన్ని, పోర్టు ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.నాగేశ్వరరావు, మణి జి.వీరబాబు, జి.అప్పారావు, గోవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా జెడ్పీటీసీ రాజరాజేశ్వరి



రాజరాజేశ్వరి

ప్రత్తిపాడు: జిల్లా విజిలెన్స్ (సివిల్ సప్లయిస్) కమిటీలో సభ్యురాలిగా ప్రత్తిపాడు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆమె సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజరాజేశ్వరి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన రాజరాజేశ్వరిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు, మాజీ సర్పంచ్ శిరసాల రామకృష్ణ అభినందించారు.

విజిలెన్స్ కమిటీ మెంబర్‌కు సత్కారం



జగ్గంపేట బిందుమాధవిని సత్కరిస్తున్న మహిళలు

జగ్గంపేట: కాకినాడ జిల్లాస్థాయి సివిల్ సప్లయిస్ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా నియమితులైన జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవిని సోమవారం ఘనంగా సత్కరించారు. జగ్గంపేటలోని ఆమె స్వగృహంలో ప్రజాప్రతినిధులు, అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల, శాలువాతో సత్కరించారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తనకు అరుదైన గౌరవాన్ని ఇచ్చారని, ఆ పదవికి న్యాయం చేస్తానని బిందుమాధవి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.